విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 10 డిసెంబర్ 2024 8 పేజీలు

అక్రమ పెన్షన్ల పరిశీలన

- పైలెట్ ప్రాజెక్టుగా చిలకపాడు సచివాలయం
- విచారణ చేపట్టిన అధికారులు
- అక్రమ పెన్షన్‌దారుల్లో ఆందోళన
- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు
- గత ప్రభుత్వంలో అనర్హులకు ఇచ్చారని ఆరోపణలు
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలో అక్రమ పెన్షన్‌దారులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీనిలో భాగంగా ముందుగా జిల్లాలో సంతనూతలపాడు మండలం చిలకపాడు సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించారు. ఆ సచివాలయం పరిధిలో 393 పెన్షన్‌దారులు ఉన్నారు. వారిలో అర్హులు ఎవరు, అనర్హులు ఎవరనేదానిపై సెర్ప్ అధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపడుతున్నారు. ముందుగా ఒక సచివాలయంలో పరిశీలించిన అనంతరం తదుపరి జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయ పరిధిలోని ప్రస్తుతం పెన్షన్ తీసుకుంటున్న వారిని విచారించనున్నారు. ప్రభుత్వం నేడు, రేపు రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ పెన్షన్ దారులపై విచారణకు ఆదేశించిన విషయం విధితమే. మండలాల్లో ఎంపీడీఓ, సెర్ప్ అధికారులు, కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో అనర్హులు కూడా వివిధ రకాల పెన్షన్లు ఇచ్చారన్న ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షన్లను మరోసారి వారి యాప్‌లో ఆధార్‌కార్డుతో ఇతర సర్టిఫికెట్ల ఆధారంగా పరిశీలిస్తారు. అనర్హుల పెన్షన్లను తీసేస్తారు. ఈ నెల 15 నుంచి జిల్లాలో అర్హులైన వారు పెన్షన్లకు రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం పెన్షన్‌దారులపై విచారణ చేపట్టి ఆ విచారణలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై కూడా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒక సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దీనిలో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గంలోని నూతలపాడు మండలం చిలకపాడులోని సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించారు. ఆ సచివాలయంలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు ఇలా పెన్షన్ తీసుకునేవారు 393 మంది ఉన్నారు. వీరిలో నిజమైన అర్హులు ఎవరు, అనర్హులు ఎవరు అనేదానిపై సోమవారం విచారణ చేపట్టారు. మంగళవారం కూడా విచారణ చేసి సాయంత్రంలోగా నివేదికను ప్రభుత్వానికి పంపించాల్సి ఉంది. ఈ నివేదిక ఆధారంగా జిల్లాలోని అన్ని సచివాలయాల్లో ప్రత్యేక బృందాలను నియమించి విచారణ చేపడతారు. అనంతరం అనర్హులకు ఎవరికైనా పెన్షన్ ఇస్తుంటే వాటిని తొలగించి అర్హులైన వారికి పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు అర్హత లేకుండా ఎవరైతే పెన్షన్ పొందుతున్నారో వారిలో ఆందోళన మొదలైంది.

భూ సమస్యలు పరిష్కరించేందుకు
రెవెన్యూ సదస్సులు

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : భూ సమస్యల పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మునగపాడు పంచాయతీ బసాపురం గ్రామం రెవెన్యూ సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దుర్మార్గపు పాలన చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని కొంతమంది రైతుల భూములను ఆక్రమించుకొని వారిని ఇబ్బందులు గురిచేసిందన్నారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే నిరూపిస్తే వారి భూములు వారి పేరు మీదనే తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి మౌలిక వసతులు కల్పించి సిసి రోడ్లు సైడ్ కాలవలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రెండు నెలల్లో పల్లె అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకొని మీ భూ సమస్యలను పరిష్కరించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆవులు సురేష్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కామసాని రాంరెడ్డి టిడిపి నాయకులు కనకం నరసింహారావు భీమాంజనేయరెడ్డి కుందూరు కాశిరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు జయప్రదం చేయాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : రెవెన్యూ సదస్సులు జయప్రదం చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పర్చూరు మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని కలెక్టర్ చెప్పారు. పర్చూరు మండలం చిననందిపాడు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి సిసోడియ హాజరవుతారన్నారు. సదస్సు నిర్వహణలో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. దేవాదాయశాఖ భూముల వివరాలు, అడంగల్లు, ఆర్ఎస్ఆర్‌లు పక్కాగా ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. పిజిఆర్ఎస్‌లో ఆ మండలం నుంచి పునరావృతమైన అర్జీలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, కె.ఆర్.ఆర్.సి ఎస్.డి.సి లవన్న, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదానీ అవినీతిపై విచారణ జరిపించాలి

- విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి
- సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బల్లికురవ : అదానీ అవినీతి కుంభకోణంపై అదానీ గ్రూప్ కంపెనీలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం డిమాండ్స్ దే కార్యక్రమంలో భాగంగా బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతూ మణిపూర్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సాయుధబలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించాలన్నారు. నేడు పేదవాడు బ్రతికేందుకు వీలు లేకుండా నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశం అంటుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని తక్షణమే అధిక ధరలను నియంత్రించాలన్నారు. ఎంతోమంది ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే నిరుద్యోగులందరికీ ఉద్యోగులు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే విద్యుత్ ఛార్జీలు పెంపుదలను నిలిపివేయాలి అన్నారు. అమెరికాలోని న్యూయార్క్‌కు ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్ట్‌లో అదానీపై అవినీతి కేసు నమోదు అయిందని విద్యుత్ ఒప్పందాల కోసం దాదాపు 2100 కోట్లు దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో అదానీ లంచాలుగా ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇందులో అత్యధికంగా 1750 కోట్లు మన రాష్ట్రంలోనే గత ప్రభుత్వ హయాంలో ముడుపులుగా ముట్ట జెప్పినట్లు తెలుస్తుంది అన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీల భారం మోపబడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అదానీతో చేసుకున్న ఒప్పందాలు అన్ని రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అదానీని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల బాధ్యులు వల్లెపు నరసింహం, అట్లూరి శ్రీనివాసరావు, నగబోయిన శివయ్య పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ డ్రోన్‌తోనే కట్టడి : గొట్టిపాటి లక్ష్మీ 2లో

సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : పశుపోషకులు సీజనల్ వ్యాధుల అప్రమత్తంగాఉండాలని పశువైద్యాధికారిని ఎం.విజయలక్ష్మి అన్నారు. స్థానిక పశువైద్యశాలలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కే విజయ్ ప్రకాష్, రావేప్ఇంచార్జ్ పి.భరత్ చంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పశు వైద్యంపై విద్యార్థులకు వివరిస్తూ నట్టల నివారణ, సీజనల్ వ్యాధులు సంభవించినప్పుడు టీకాలు వేయడం, గాలికుంటు వ్యాధి, గిట్టలలో పుండ్లు ఏర్పడడం, నాసు వ్యాధి గురించి వివరించారు. తిరగ కట్టిన గేదెలను గురించి వివరించారు. జ్వరం రావడం, గర్భాశయ వ్యాధులు, సూది పరీక్షలు, ఎద ఇంజక్షన్లు గురించి వివరించారు. వర్షాకాలంలో గొర్రెలకు, మేకలకు గిటలలో పాచి పట్టి గురించి వివరించారు. ఈ శిబిరంలో 75 గేదెలకు, 14 ఆవులకు, 25దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు వేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలానా ముస్తాక్ అహ్మద్‌కు అభినందనలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : సోమవారం విజయవాడ ఆర్టీసి బస్టాండ్ దగ్గరలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మౌలానా ముస్తఫా అహ్మద్ ప్రమాణ స్వీకారోత్సవ సందర్భంగా మైనారిటీ సెల్ నాయకుడు షేక్ మంజూర్ భాష, షేక్ జిలానిలు విజయవాడలో ప్రమాణ స్వీకారంలో పాల్గొని మౌలానా ముస్తఫాను కలిసి సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో శాలువాలతో సన్మానించారు. అనంతరం అతనికి శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ నాయకుల అభినందనలు

మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన జిల్లా ముస్లిం తెలుగు దేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్ బాషా విజయవాడలో జరిగిన ప్రమాణ స్వీకారంలో పాల్గొని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మౌలానా ముస్తఫా మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం అతనికి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మౌలానా ముస్తాక్ అహ్మద్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఒంగోలు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్ బాషా. మైనార్టీ నాయకులు కార్యక్రమంలో షేక్ భాష తెలుగు యువత కార్యదర్శి షేక్ సత్తార్, పఠాన్ సత్తార్,షేక్ మౌలాలి, మొఘల్ రఫీ,షేక్ యూసుబ్, సయ్యద్ సలీం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'ప్రజా విజ్ఞప్తుల'కు ఏడు అర్జీలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినానికి ఏడు అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్ తెలిపారు. ఇందులో సర్వే కొరకు రెండు అర్జీలు, భూమిని ఆన్లైన్ కొరకు మూడు అర్జీలు, పాస్ పుస్తకాలు మంజూరు కొరకు రెండు అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏ.ప్రవంతి, సీనియర్ అసిస్టెంట్ పోగులశేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ వాటపల్లి కృష్ణ ప్రసాద్, వీఆర్ఓ సిహెచ్ బ్రహ్మ తేజ, శ్రీనివాసరావు, దేవకాంత్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ డ్రోన్‌తో సాధ్యమే

విశాలాంధ్ర-ముండ్లమూరు : పోలీసు వ్యవస్థలో కేసులను సత్వరమే పరిష్కరించేందుకు, నేరాల నియంత్రణకు డ్రోన్ ఎంతో సహాయ పడుతుందని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ అన్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరులో సమ్మిట్ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటిసారిగా దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరులో సోమ వారం డ్రోన్‌ను ఆమె ప్రారంభించారు. దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ తానికొండ వెంకటరావు 1,80,000 రూపాయల విలువ గల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న డ్రోన్‌ను అందజేశారు. తానికొండ వెంకటరావుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఇటీవల విజయవాడలో డ్రోన్ సోను నిర్వహించారు. దర్శి సీఐ ఎండ్లూరి రామారావు మాట్లాడుతూ డ్రోన్ సహాయంతో అల్లర్లు, డ్రగ్స్, పేకాట కోడిపందాలు, అసాంఘిక కార్యకలాపాల కు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ముండ్లమూరు ఎస్ఐ వై నాగరాజు మాట్లాడుతూ డ్రోన్ సహాయంతో నేరాలు అదుపు చేయవచ్చన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కొత్త వ్యక్తులను కనిపెట్ట వచ్చున్నారు. రాత్రి సమయాలలో దొంగతనం జరగకుండా నిరోధించవచ్చున్నారు, దర్శి ఎస్ఐ మురళి మాట్లాడుతూ గ్రామాలలో నేరాల నియంత్రించేందుకు డ్రోన్లు ఎంతో సహాయం చేస్తాయని, దొంగ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని, ట్రాన్స్ఫార్మర్ల దొంగతనాలపై, డ్రోన్ ద్వారా నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఘన విజయం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఉభయ గోదావరి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో యూటీఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఘన విజయం సాధించటం పట్ల యూటీఎఫ్ సీఎస్‌పురం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారిశెట్టి వెంకట్రామయ్య, షేక్ పాదుషా, జిల్లా కార్యదర్శి అరియారం సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడుచున్న యూటీఎఫ్ సంఘాన్ని ఉపాధ్యాయులు ఆదరించి అఖండ విజయాన్ని అందించడం ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే కాకుండా కుటుంబ సంక్షేమ పథకం ద్వారా చనిపోయిన యూటీఎఫ్ ఉపాధ్యాయుల కుటుంబాలకి భరోసా కల్పిస్తున్న ఏకైక సంఘం యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘమని వారు తెలిపారు. మన మండల యూటీఎఫ్ ఉపాధ్యాయులు స్వర్గీయ చెంచిరెడ్డి కుటుంబానికి కూడా కుటుంబ సంక్షేమ పథకం ద్వారా లక్ష యాభైవేల రూపాయల చెక్ అందించినట్లు వారు తెలిపారు. మండల ఉపాధ్యాయులు ఎక్కువమంది కుటుంబ సంక్షేమ పథకంలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.

జాతీయ స్థాయి కరాటే- కుంపు పోటీల్లో బంగారు పతకాలు

విశాలాంధ్ర-చీమకుర్తి : జాతీయస్థాయి కరాటే-కుంపు పోటీల్లో బంగారు పతకాలు సాధించిన చీమకుర్తి కరాటే విద్యార్థులను అభినందిస్తున్న సి.ఐ. సుబ్బారావు. ఆదివారం చిలకలూరి పేటలో డాక్టర్ అంబేడ్కర్

మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరాటే -కుంపు పోటీల్లో చీమకుర్తి విద్యార్థిని విద్యార్థులు ప్రథమ స్థానం సంపాదించి బంగారు పతకాలు సాధించారు. కరాటే ట్రైనింగ్ ఇచ్చిన కరాటే మాస్టర్ డి.ఎన్.వి.సుధాకర్ ను ప్రత్యేకంగా అభినందించారు. సి.ఐ. సుబ్బారావు మాట్లాడుతూ చీమకుర్తి పేరును జాతీయస్థాయిలో నిలబెట్టిన విద్యార్థులను అభినందిస్తూ, బంగారు పతకాలు సాధించడం చాలా ఆనందించదగ్గ విషయమని. కరాటే యోగా మార్షల్ ఆర్ట్స్ లాంటివి విద్యను అందరూ కూడా తప్పక అభ్యసించాలని, ప్రత్యేకంగా మహిళా విద్యార్థులు కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఎల్. రేణుక, శ్రీసాయి, సునంద, ప్రహ్లాదిక, లక్ష్మి, శ్రీ వెంకట సాయి, గురు విష్ణు, కౌస్తు ఉన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-తాళ్లూరు : రబీకి బీమా పథకాన్ని నమోదు చేసుకొని విపత్తుల సమయంలో ఉపయోగించుకోవాలని జెడ్పీటీసీ మారం వెంకట రెడ్డి అన్నారు. తాళ్లూరు, కొర్ర పాటి వారి పాలెం, విఠలాపురం గ్రామాలలో బీమా పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రీమియం చెల్లింపు ఈనెల 15తో ముగుస్తున్నందని డిప్యూటీ కలెక్టర్, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మాధిరి అన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు ఇంద్ర సేనా రెడ్డి, శ్రీదేవి రామయ్య, తహసీల్దార్ సంజీవ రావు, డిటీ ఇమ్మానియేల్ రాజు, ఏపిఎలు నాగ రాజు నాయక్ పాల్గొన్నారు.

దళితుల భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-పీసీపల్లి : దళితులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్మెంట్ భూమిని కొంతమంది పెత్తందారులు అక్రమంగా ఆక్రమించడానికి అడ్డుకోవాలని ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెద చెర్లోపల్లి మండలంలో చింతగుంపల్లి గ్రామంలో జరిగిన రెవిన్యూ సదస్సులో భూ సమస్యలపై మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చింతకుంపల్లి వేపగుంపల్లి వెలుతుర్లవారిపల్లి గ్రామాలకు చెందిన దళితుల పట్టా భూములను స్థానిక పెత్తందారులు తమ రాజకీయ పలుకుబడితో దౌర్జన్యంగా పేదల భూములను అక్రమంగా సాగు చేయటానికి ప్రయత్నం చేస్తున్నారని దళితుల

భూముల్లోకి పోకుండా వారిని అడ్డుకుంటూ దారులు లేకుండా చేస్తున్నారని మీ భూములు మాగంటి భూస్వాములుగా ఉన్నటువంటి పెత్తందారులు భూములు సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వెలుతుర్లవారిపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 148/1 148/2 148/3 చెందినటువంటి పట్టాదారులైన వేల్పుల తిరుపతయ్య వేల్పుల వెంకటేశ్వర్లు పల్లె ఓబులు పల్లె కేశవరావు చిన్న రాములుకు చెందిన భూములను సుమారు 20 ఎకరాలు అసైన్మెంట్ భూమిని అక్రమంగా ఆక్రమించారని ఆక్రమణదారులకు అబంధహస్తాల నుండి భూమిని విముక్తిపరిచి తిరిగి దళితులకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు చింతగుంపల్లి సర్వేనెంబర్1లో ఎనిమిది వందల ఎకరాలు ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టాలు పొందినటువంటి పట్టాలను రద్దుచేసి ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు వ్యవసాయ భూమిని భూమిలేని ప్రతి పేదవానికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా తహసీల్దార్ ఉష మాట్లాడుతూ పేదల భూసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పుల తిరుపతయ్య వేల్పుల వెంకటేశ్వర్లు పల్లె ఓబులు పల్లె కేశవరావు పల్లె చిన్నరాముడు భూ బాధితులు పాల్గొన్నారు.

పేదల భూ సంరక్షణ కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

విశాలాంధ్ర-తర్లుపాడు : రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వేల మంది పేద బలహీన వర్గాలవారికి చెందిన భూములు గత ఐదు సంవత్సరాల వైయస్సార్ పార్టీహయాంలో కబ్జాలకు గురై దగాపడ్డారని క్యాబినెట్స్ సమావేశంలో నిర్ధారణ అయిన తర్వాతనే గుజరాత్ రాష్ట్ర తరహా ల్యాండ్ గ్రాఫ్చట్టాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తెలియజేశారు. తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డి పల్లెపంచాయతీలోని సచివాలయ ఆవరణలో తహసీల్దార్ విజయ భాస్కరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా గ్రామ మాజీ సర్పంచ్ ఆరికట్ల వెంకటేశ్వరరెడ్డి, కుందూరు సత్యనారాయణ రెడ్డి, వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సదస్సులో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనను గాలికి వదిలేసి కేవలం ప్రజల మనోభావాలు దెబ్బ తినే విధంగా భూకబ్జాలు, కక్షలు, దౌర్జన్యాలు, ల్యాండ్ మాఫియా, ఇసుకమాఫియా, లిక్కర్మాఫియాలతో రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చి, సంక్షేమం పేరిట రాష్ట్రాన్ని దివాలా తీయించాడన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగస్తులకు ప్రతి నెల సక్రమంగా జీతాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు తన మేధాశక్తితో రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నా డన్నారు. భూ కబ్జాదారుల గుండెల్లో కూటం ప్రభుత్వం గుణపం దించుతుందన్నారు. మండల స్పెషల్ అధికారి బి.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ యు విజయభాస్కర్, ఇఓఆర్‌డి సుకుమార్, వీఆర్వోలు వై.కాశీ విశ్వేశ్వరరెడ్డి, శివకాశిలు, సర్వేయర్ మస్తాన్రెడ్డి, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, గ్రామ టిడిపి నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి సమస్యలతో కూడిన అర్జీలను ఎమ్మెల్యే సమక్షంలో సంబంధిత అధికారులకు సమర్పించడం జరిగింది.

పారదర్శకంగా రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సదస్సులలో భూ సమస్యలలో ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వం గుర్తించి ప్రత్యేకంగా గ్రామ సభలను ఏర్పాటు చేసిందని అందుకను గుణంగా ప్రతి ఒక్కరూ భూమికి సంబంధించినటువంటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని టిడిపి నాయకులు మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని గన్నవరంలో నిర్వహించిన గ్రామ సదస్సులో తహసీల్దార్ సువర్ణకి గ్రామ ప్రజలు అర్జీ అందజేశారు. మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కార దిశగా ప్రభుత్వం గ్రామ సదస్సులో ఏర్పాటు చేసిందని ఈ యొక్క అవకాశాన్ని రైతులందరూ వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రవి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ సానా జైపాల్ రెడ్డి, ముక్కు వెంకటేశ్వర్ రెడ్డి రావి గురుస్వామి, ఎడ్ల కొండారెడ్డి పాపా కోటిరెడ్డి ఎస్టీ సెల్ రవి అన్నపరెడ్డి కొండారెడ్డి తాతలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

సీఐ ప్రభాకర్ రావు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతున్న వేళ యర్రగొండపాలెం సీఐ సీఎచ్ ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో యర్రగొండపాలెం సర్కిల్ సబ్ ఇన్స్పెక్టర్‌లు, పోలీసు సిబ్బంది పట్టణంలో ట్రాఫిక్ కు చర్యలు తీసుకున్నారు. ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యాపారుల అక్రమణలను తొలగించారు. ఎవరైనా రోడ్లపై వాహనాలు నిలిపినా, నంబర్ ప్లేట్లు, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో నంబర్ ప్లేట్లు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్లకు ఇరువైపులా షాపుల నిర్వహణదారులు ఆక్రమిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు, దోర్నాల సబ్ ఇన్స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : పాఠశాలకు దాతలు సహకరించడం అభినందనీయమని సీఎస్‌పురం జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఖాదరున్నీసాబేగం అన్నారు. మండలంలోని ముండ్లపాడు ప్రాథమిక పాఠశాలకు ముండ్లపాడు గ్రామానికి చెందిన ఎస్ శివారెడ్డి, గజ్జల కోటిరెడ్డిలకు సన్మానసభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరంశెట్టి చెన్నయ్య, గ్రామ పెద్దలు వెంకటనారాయణ, మాలకొండారెడ్డి, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు మాలకొండయ్య, బి.చిన్ననారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయించిన సర్పంచ్

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని వెలిగండ్లలో సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు సోమవారం వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు రాత్రి వేళలో గబగినమి చీకటిగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులను పడుతున్న విషయాన్ని గమనించిన సర్పంచ్ వెంటనే వివిధేపాలను ఏర్పాటు చేయించాలని తెలిపారు. రాత్రి వేళలో స్తంభాలకు వీధులలో వీధి దీపాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకురావడంతో ఏర్పాట్లు చేసినట్లు అని తెలిపారు.

వైఎస్ భారతి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-చీమకుర్తి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సతీమణి వైయస్ భారతి జన్మదిన వేడుకలను చీమకుర్తిలో బదిలీలు పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వైఎస్ భారతికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్ భారతీయ సేవా సమితి అధ్యక్షులు పాటిబండ్ల రాజ సులోచన, మున్సిపల్ కౌన్సిలర్ పార్టీ మండల గంగయ్య, మాజీ కౌన్సిలర్ శారద స్కూల్ హెడ్మాస్టర్ అంజిరెడ్డి,పాడిపండ్ల రవికుమార్, నాగండ్ల ఆంజనేయులు, బోడిపోగా ఆశీర్వాదం పాల్గొన్నారు.

గర్భిణీలకు మధ్యాహ్న భోజన సదుపాయం

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు మధ్యాహ్న భోజన సదుపాయం కురిచేడు లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల కాలము నుండి కొనసాగుతూనే ఉన్నది. ఇందులో భాగంగా లయన్స్ క్లబ్ సభ్యులు అందరూ హాజరై సహాయ సహకారాలు అందించారు. ఎండి అమీర్ ఖాన్ కుటుంబ సభ్యులు సోమవారం సుమారు 300 మంది గర్భిణీ స్త్రీలకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. ప్రాథమిక వైద్యశాల యందు ప్రతినెల తొమ్మిదవ తేదీన జరుగు గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారు వీరికి బీపీ షుగర్ స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తుంటారు గర్భిణి స్త్రీలు ఎంతో సుధీర ప్రాంతాల నుండి వస్తూ ఉంటారని వారికి మధ్యాహ్న భోజన సదుపాయం లేఖ ఇబ్బందులు పడుతున్నట్లు లయన్స్ క్లబ్ వారు గుర్తించి ప్రతి నెల దాతల సహాయముతో మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమములో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వివి రమణారావు జోన్ అధ్యక్షులు జేబీ రామారావు పెండ్యాల ప్రసాదరావు డాక్టర్ ప్రవీణ్ డాక్టర్ తేజ ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు అటెండర్ కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల మెరుపు దాడులు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలో విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారిపై కేసులు నమోదు చేసేందుకు జిల్లా కేంద్రం ఒంగోలు నుండి, మార్కాపురం డివిజన్‌కు సంబంధించిన విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులైన పివి నాగేశ్వరరావు, డిపిఈ హైమావతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఎస్ సి నాయక్ మరియుకంభం, గిద్దలూరు డిప్యూటీ ఇంజనీరింగ్ల ఆధ్వర్యంలో సుమారు 37 బంధాలుగా ఏర్పడి మండలంలో 33 గ్రామాల్లో ఆకస్మికంగా మెరుపు దాడు లు నిర్వహించడం జరిగింది. ఈ దాడుల్లో సుమారు 2,532 విద్యుత్తు సర్వీస్ కనెక్షన్లను తనిఖీ చేశారు ఇందులో అక్రమంగా విద్యుత్తు వాడుకున్న వారి నుండి మరియు అధికలోడు వినియోగిస్తున్న వారైతే నేమి మొత్తం 36 మంది పై కేసు నమోదు చేసి ఒక లక్ష 36 వేల రూపాయల అపరాధ రుసుము విధించడమైనది. ఈ విధంగా దాడులు నిర్వహించడం వలన విద్యుత్ చోరీకి గురి కాకుండా ప్రభుత్వానికి సక్రమంగా ఉపయోగ పడుతుందన్నారు. ఇలాంటిదాడులవలన వినియోగదారులకు విద్యుత్ కోత లేకుండా సక్రమంగా ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల విద్యుత్ ఏఈ హనుమ నాయక్, వారి బృందం పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు
7వ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టులో
ఇ.పి.నెం.247/2023 లో
ఎ.ఒ.పి.నెం.248/2021

పిటీషన్:
మెసర్స్. అరుణా ఫైనాన్స్ లిమిటెడ్
రిప్రజెంటెడ్ బై ఇట్స్ ఆథరైజ్డ్ సిగ్నేటరీ.
-DHR / పిటిషనరు
మరియు
1. ఏల్చూరి శ్రీనివాసరావు వగైరాలు -JDRs /రెస్పాండెంట్లు
జెడిఆర్-2. పాడి లక్ష్మి పార్వతి, భర్త వీరాంజనేయులు, డోర్ నెం.6-379, ఆంధ్ర కేసరినగర్, కర్నూల్ రోడ్, ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్.
నోటీసు
కోర్టువారి ఉత్తర్వుల మేరకు తెలియజేయునది ఏమనగా పై ఇ.పి. నందు ది.17-12-2024 న మీ హాజరు నిమిత్తం వాయిదా అయివున్నందున ఆరోజు మీరు స్వయంగా గానీ లేక లాయరు ద్వారా గానీ ఉదయం 10.30 నిIIలకు పై కోర్టుకు హాజరై మీకు గల అక్షేపణలు తెలుపు కొనవలెను, లేనియెడల కోర్టువారు పై కేసు నందు మీ పరోక్షములో తీర్మానంచేయుదురని తెలియజేయడమైనది.
వాయిదా : 17-12-2024
(కోర్టువారి ఉత్తర్వులతో)
వి.యన్.చక్రవర్తి, కె.సుమతి
యస్.కె.ఉస్మాన్ సాహెబ్
న్యాయవాదులు
జిల్లాకోర్టు ఎదురుగా, ఒంగోలు-523001
సెల్: 9848440105, 9944128014

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యలను వెల్లబుచ్చుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను విని ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణిత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్థి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 37 మంది అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పి.జి.ఆర్.ఎస్ ఇంచార్జ్ సీఐ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు భరోసా సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అని జనసేన బాపట్ల మండల అధ్యక్షుడు దాసరి ఏసుబాబు తెలిపారు. బాపట్ల పేరెంట్స్ మీటింగ్‌కి సీఎం వచ్చిన సందర్భంగా ఏసుబాబు మర్యాద పూర్వకంగా కలసి జనసేన పార్టీ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సీఎంకు పరిచయం చేసి కూటమి ప్రభుత్వం తరుపున ఎన్నికల సమయంలో జనసేన పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారని సీఎంకి వేగేశన వివరించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రాజకీయంగా ఎదగడానికి తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

వివాహ రిసెప్షన్ వేడుకలో...కదిరి బ్రదర్స్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని శీలంవారిపల్లి గ్రామానికి చెందిన కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ ప్లస్2 కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతి రావు మనమడు రాకేష్, అమూల్యల వివాహ రిసెప్షన్ వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, కదిరి బాబురావు విద్యాసంస్థలు చైర్మెన్ కెవి ప్రకాశ్‌రావు, సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, కోశాదికారి కదిరి బాలకృష్ణ, హాజరై వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రక్షిత పార్మ కంపెనీ అధినేత చందన రామేశ్వర రావు, కదిరి రాజేష్, ఇరగని చలపతిరావు, కొవిలంపాడు సర్పంచ్ షేక్ బుజ్జి, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ టి బాబురావు, గోనూ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

మునిసిపల్ కార్మికుల ధర్నాలో అందె నాసరయ్య డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సాక్షాత్తూ సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ దాన్ని అమలు చేయకుండా పాలకవర్గాలు తిప్పి కొడుతున్నాయని ఇది మంచిది కాదని ఇప్పటికైనా స్పందించి మునిసిపల్ కార్మికులకు పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేలు వేతనం అందించాలని జిల్లా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అందె నాసరయ్య డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ కార్మికులు (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అందె నాసరయ్య మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో మరోవైపు చాలీచాలని వేతనాలతో కార్మికులు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమమే తమ సంక్షేమం అని పదేపదే ప్రకటించే పాలకవర్గం ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. మునిసిపల్ కార్మికులకు పీఎఫ్ అందించాలని అలాగే పింఛన్ కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ కార్మికులకు నూనె, సబ్బులు బట్టలు అందించక పోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున ఇప్పటికైనా అవి మంజూరు చేయాలని అందె నాసరయ్య డిమాండ్ చేశారు.

జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్‌కె కాశిం మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని కావున భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు హరిబాబు, పట్టణ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దరగయ్య, వేమా వెంకటేశ్వర్లు, కార్మిక నాయకురాళ్లు కోటమ్మ, కాశిం పాల్గొన్నారు.

చెన్నుపాటి లక్ష్మయ్యకు ఘననివాళి

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ చెన్నుపాటి లక్ష్మయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా సింగరాయకొండ మండల పరిధిలోని యుటిఎఫ్ కార్యాలయంలో డి.బాలకొటయ్య అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బి.గోపీమూర్తి ఘన విజయం సందర్భంగా అభినందన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి కొల్లూరి వెంకయ్య, మండల ప్రధాన కార్యదర్శి జె.ప్రభాకర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులైన జె కేశవరాజు, ఎ.వెంకటస్వామి. రిటైర్డ్ టీచర్స్. పి.రామ్మూర్తి.కె. నారాయణ, వెంకటేశ్వర్లు మొదలగు వారు పాల్గొనడం జరిగింది.

సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎస్ఐ

విశాలాంధ్ర-పిసీపల్లి : మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై జి.కోటయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై హాస్టల్లో సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేవా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ పథకాల గురించి వివరించారు అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో భావిభారత పౌరులుగా ఎదగాలంటే క్రమశిక్షణతో నడుచుకుంటూ మన చుట్టూ ఉన్న పరిస్థితులను అవగాహన పరుచుకుని ముందుకు వెళ్లాలని ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్యాలతో కూడిన ప్రణాళికబద్ధమైన నడవడికతో మెలగాలని తెలిపారు. అలా మెలిగినప్పుడే తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగిస్తూ ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ వాచ్మెన్ తదితరులు ఉన్నారు.

జార్జి ఇంజనీరింగ్ కళాశాలకు 'నాక్' ఏ గుర్తింపు

- త్వరలో అటానమస్ హోదా
- కళాశాల సాంకేతిక సలహాదారు డాక్టర్ సురేష్ వెల్లడి

విశాలాంధ్ర-మార్కాపురం : ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే మొట్టమొదటి ఇంజనీరింగ్ కళాశాలైన డాక్టర్ శ్యామేల్ ఇంజనీరింగ్ కళాశాలకు "నాక్ ఏ" గ్రేడ్ (నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్) ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ఈశ్వర రావు అధ్యక్షతన సోమవారం సాయంత్రం కాలేజీలో ఈ సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథి కళాశాల సాంకేతిక సలహాదారు డాక్టర్ అదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాలలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశమైన మార్కాపురం ప్రాంతంలో సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు అందించాలన్న గొప్ప ఆశయంతో మా తండ్రి స్వర్గీయ డాక్టర్ జార్జి మార్కాపురంలో జిల్లాలోనే మొట్టమొదటగా ఇంజనీరింగ్ కళాశాలలో 1996లో ప్రారంభించారని గుర్తుచేశారు. గత 28 సంవత్సరాలుగా జార్జ్ కళాశాల విలువలతో కూడిన విద్యను అందిస్తూ వేలాది మందిని ఇంజనీర్స్‌గా తయారు చేయడం జరిగిందని అన్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధన తోపాటు నాణ్యత ప్రమాణాలను కూడా పాటించడంలో ముందున్నామని అన్నారు. నేడు తమ కళాశాలకు వచ్చిన నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు ఐదు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని అన్నారు. ఈ గుర్తింపు రావడం వలన జార్జ్ కళాశాలకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించినట్లు అయిందని అన్నారు. అలాగే ఈ గుర్తింపును నిలుపుకునేందుకు మరింత కష్టపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని కూడా ఆయన సిబ్బందికి సూచించారు. కళాశాలలో ల్యాబ్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఫ్యాకల్టీ, స్పోర్ట్స్ గ్రౌండ్, అకౌంట్స్ వీటితోపాటు 38 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కళాశాల నిర్మాణం జరిగిందని అన్నారు. ఒక యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌తో పాటు మరో ఇద్దరు ప్రొఫెసర్లతో కూడిన త్రిసభ్య కమిటీ కళాశాలకు చెందిన గత 5 సంవత్సరాల రికార్డులను, అన్ని విభాగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తరువాతనే నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించని ఆయన అన్నారు. అలాగే త్వరలో కళాశాల అటానమస్ కూడా కానుందని అన్నారు.

ఈ గుర్తింపు రావడానికి సహకరించిన సిబ్బందికి సాంకేతిక సలహాదారు డాక్టర్ సురేష్ అభినందనలు తెలిపారు. నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు వచ్చిన సందర్భంగా సాంకేతిక సలహాదారు డాక్టర్ ఏ సురేష్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి స్వీట్స్ అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు, ఐక్యు ఏసికో - ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ కాశిం, డీన్ ఎం. మస్తానయ్య, హెచ్ఓడి ఫిజిక్స్ విభాగం డాక్టర్ కె. డానియల్ పాల్గొన్నారు.

దయల్ యువర్ డీఎం ప్రోగ్రాం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఏపీఎస్ ఆర్టీసీ అభివృద్ధికి అలాగే ప్రయాణికులు విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకే డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నారని బాపట్ల డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ తెలిపారు. బాపట్ల పరిసర ప్రాంత ప్రయాణీకులు డిసెంబర్ 10న సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డిపో మేనేజర్ కార్యాలయంలో డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని బాపట్ల డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, బాపట్ల డిపోని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరు కష్ట పడుతున్నామని అందులో భాగంగా ఆర్టీసీ ప్రయాణికులు విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేసే విధంగా సలహాలు సూచనలు డయల్ యువర్ డిపో ప్రోగ్రాం ఫోన్ నెంబర్ 9959225425కి తెలియజేయాలని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - అద్దంకి : ఈనెల 11,12 తేదీలలో వాయుగుండం వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొక్కజొన్న, వరి కోతలు వాయిదా వేసుకోవాలని,శనగ, మొక్కజొన్న సాగు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కారును ఢీకొన్న ఆటో

విశాలాంధ్ర - చీరాల : ఒంగోలు నుండి చీరాల వస్తున్న ఆటో అల్యూమినియం రేపర్లు రవాణా చేస్తూ అదుపుతప్పి ముందు వెళుతున్న కారును ఢీకొట్టిన ఘటన సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అక్కయపాలెం మస్తాం అపార్ట్మెంట్ మధ్య జాతీయ రహదారిపై జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న డ్రైవర్ ప్రక్కనున్న తోటి హెల్పర్‌కు తీవ్ర గాయాలుకాగా, మరో ఆటలో వారిని చీరాల ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.

రైతు ఫిర్యాదుతో కేసు నమోదు

విశాలాంధ్ర - యద్దనపూడి : ఆరుగాలం కష్టించి పండించిన శనగ పంటను అమ్ముకోగా కొనుగోలు చేసిన వ్యక్తి నగదు ఇవ్వకుండా మోసం చేస్తున్న సంఘటన యద్దనపూడి మండలంలో చోటు చేస్తుంది.ఎస్సై రత్నకుమారి తెలిపిన వివరాలు ప్రకారం యద్దనపూడి గ్రామానికి చెందిన రైతు గొట్టిపాటి వెంకటరావు అనే వ్యక్తి శ్రీనివాస కోల్డ్ స్టోరేజ్‌లో సుమారు 320 క్వింటాలు నిల్వ చేయగా,వాటిని చిలకలూరిపేటకు చెందిన గోగుల నాగరాజుకు అక్టోబర్ నెలలో అమ్మగా సుమారు రూ.21 లక్షలు డబ్బులు ఇవ్వకుండా ఉద్దేశ పూర్వకంగా మోసం చేస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ప్రజా సమస్యల అర్జీలను తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వాటిని పి.జి.ఆర్.ఎస్‌లో నమోదు చేయాలని చెప్పారు. జిల్లా అధికారులు సంబంధిత శాఖలపరిధిలోని పనులను పూర్తిచేయటమే కాకుండా పూర్తయినటువంటి పనుల వివరములను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాల భవనాల మరమ్మతులు, మౌలిక వసతులు పూర్తి చేయుటకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వం అధికారులకు ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశ సమయములోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పరిధిలో చేయదగినవి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు సూచించారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాలలోపు వయసుగల పిల్లలందరికి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రంలో నమోదు చేయాలని ఆయన చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 105 అర్జీలు వచ్చాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, గృహనిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు,ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు,జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ్ దిబోరా, జిల్లామహిళా శిశు సంక్షేమ అధికారి ఉమా,గుంటూరు,జిల్లా పరిషత్ డిప్యూటీవ్ సి.ఇ.ఓ కృష్ణ,జిల్లా పౌర సరఫరాల అధికారి విలిమ్స్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ కుమార్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు గేటు బహూకరణ

విశాలాంధ్ర - బల్లికురవ : జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ప్రతి ఒక్కరూ విద్యపై మక్కువ చూపించి ఉన్నత చదువులు చదువుకోవాలని అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలు అరోధించవచ్చునని ప్రముఖ అడ్వకేట్ గిరిరాజు నాగేశ్వరావు అన్నారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంకు చుట్టూ ప్రహరీ ఉండి ప్రధాన ద్వారం వద్ద గేటు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య గురిజేపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ గిరిరాజు నాగేశ్వరరావు దృష్టికి పోవడంతో తక్షణమే స్పందించి రూ.75 వేల విలువ కలిగిన గేటును బహూకరించారు. సోమవారం గేటు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో బాలికలకు విద్య ఎంతో అవసరమని బాలికల విద్య ద్వారా తన కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది అన్నారు.నేడు ప్రభుత్వ విద్యకు పెద్ద పీట్ట వేస్తూ సకల సౌకర్యాలు కల్పిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ విశేషంగా రాణించాలని కోరారు. పాఠశాలకు తన వంతు సహాయం చేసేందుకు అవకాశం కల్పించినందుకు ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో తనకు చేతనైన విధంగా విద్యాలయాలకు తన వంతు చేయూతనందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ శ్రీలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకట్రావు,విద్యాశాఖ అధికారులు వేమవరపు కోటేశ్వరరావు,దార్ల దినేష్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థులు బల్లలు వితరణ

విశాలాంధ్ర - మార్టూరు : నాలుగు దశాబ్దాల క్రితం తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల రుణం కొంతైనా తీర్చుకుందాం అనుకున్నారు ఆ పూర్వ విద్యార్థులు. అనుకున్నదే తడవుగా మార్టూరు మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆ నలుగురు పూర్వ విద్యార్థులు ప్రస్తుతం పాఠశాలకు అవసరమైన ఆరు బల్లలను కొనుగోలు చేసి పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీ జాయ్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం 1983-84 విద్యా సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన ఘంటసాల బంగారు బాబు, కమ్మ సుబ్బారావు, పొత్తూరి రమేష్ బాబు, పఠాన్ కరిముల్లాలు ప్రస్తుత విద్యార్థులకు అవసరమైన బల్లలను పాఠశాలకు బహూకరించటం అభినందనీయమని ఈ సంఘటన మరికొంతమంది పూర్వ విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కాగలదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుకు కేంద్రం ఆమోదం అభినందనీయం

విశాలాంధ్ర-గిద్దలూరు : అత్యాధునిక అభివృద్ధికై పరుగులు పెడుతున్న నవ్యాంధ్రప్రదేశ్‌కి 8 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదించడం ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు సకల సౌకర్యాలతో విద్యా బోధనకు సర్వ సాంకేతిక హంగులతో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయాల ద్వారా 7680 మంది నూతనంగా విద్యను అభ్యాసించుటకు, 504 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశం ఏర్పడబోతుందని ఉదయ శంకర్ పేర్కొన్నారు. అభినవబ్రహ్మ మాదిరిగా భారతదేశ ప్రధానమంత్రి శ్రీ శ్రీ నరేంద్ర మోదీ చల్లని చూపు ద్వారా విద్య అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త శిఖరాలకు చేయబోతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అప్పిశెట్టి ఉదయ శంకర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణానికి ఆంధ్రప్రదేశ్‌కి ప్రకటించిన 8 కేంద్రీయ విద్యాల యాల్లో ఒకటి గిద్దలూరు పట్టణానికి మంజూరు చేయించాలని అభిలాషిస్తూ గిద్దలూరు పట్టణానికి కేంద్రీయ విద్యాలయం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సాధించేందుకు కృషి చేస్తామని ఉదయ్ శంకర్ తెలిపారు. విశ్వశాంతికై అనిర్వచనీయమైన కృషి చేస్తున్న మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీనిని త్వరలో సహకారం చేయగలరని విశ్వసిస్తున్నామని ఉదయ్ శంకర్ తెలిపారు.

చెన్నుపాటి లక్ష్మయ్య సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఉపాధ్యాయ ఉద్యమంలో ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు చెన్నుపాటి లక్ష్మయ్య చేసిన సేవలు ఎనలేనివని యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జె.వినయ్ కుమార్ కొనియాడారు.సోమవారం యూటీఎఫ్ నిజాం పట్నం మండల కార్యాలయంలో చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి చెన్నుపాటి బాట వేశారని చెప్పారు.తన జీవితాంతం ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితమైన మహనుభావుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని అన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య,మండల యూటీఎఫ్ అధ్యక్షులు ఎర్రగళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎండి హుస్సేన్, కోశాధికారి యు.కుమార్, జిల్లా కౌన్సిలర్స్ డి.హరి బాబు, రాజేష్, మాలిక్, సీపీ ఎస్ కన్వీనర్ రమణ ఆడిట్ కమిటీ సభ్యులు మరక ఆంజనేయులు, మండల కార్యదర్శి సాంబయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : పేకాట స్థావరంపై దాడులు చేసినట్లు చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని ఖాజీపాలెం గ్రామం శివారు పొలాల్లో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో మండల పరిధిలో ఎవరైనా సరే కోడి పందాలు, పేకాటలు, ఇతర చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, అట్టివారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు.

ఘనంగా వైఎస్ భారతి పుట్టినరోజు వేడుక

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి భార్య వైఎస్ భారతి పుట్టినరోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి చేతుల మీదుగా దివ్యాంగులకు సంకకర్రలు పంపిణీ చేశారని వైఎస్ఆర్సీపి దివ్యాంగులు విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అయన గృహం వద్ద రామయ్యతో కలిసి ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు, వైఎస్ భారతమ్మ పుట్టినరోజు, వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లెల మౌనిక, గుంజి ఏడుకొండలు, చల్లాపల్లి గోపి,కుక్కల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉన్నప్పటికీ ఈ నెల 11,12 తేదీలలో బంగాళాఖాతంలో అల్పపీడనం పడనున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీగంగాధర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాతావరణం అనుకూలించే వరకు కొన్ని రోజులపాటు కోతలను వాయిదా వేసుకుంటే మంచిదని లేకుంటే హార్వెస్టర్ ద్వారా కోతలు కోసుకోవాలన్నారు. కోత కోసిన రైతులు నూర్పిడి చేపట్టాలన్నారు. ధాన్యాన్ని పొడి ప్రాంతంలో నిల్వ చేసుకోవాలని ఆయన తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - పర్చూరు : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూర్ సెంట్రల్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఉప్పుటూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు డాక్టర్ మువ్వా సురేష్‌బాబు, పూజ దంత వైద్యశాల వారు దంత పరీక్షలు చేశారు.145 మందికి దంత పరీక్షలు చేసి 70 మందికి దంతాలలో సమస్యలు ఉన్నట్లు గుర్తించి తమ వైద్యశాలకి వచ్చి ఉచితంగా ట్రీట్మెంట్ చేపించు కోవలసినదిగా తెలియజేశారు.దంత వైద్యుడు సురేష్ బాబు మాట్లాడుతూ దంతములుపై అవగాహన కల్పించి వారికి బ్రష్ చేసుకొనే విధానములోని మెళుకువలు తెలియ చేయటం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు దాదాపు రూ.7000లతో విద్యార్థులకు పేస్ట్,బ్రష్ బిస్కెట్లు పంపిణీ చేశారు. .కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు,కొల్లా సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.వసుంధర దేవి,పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల బహూకరణ

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ పందిళ్ళపల్లిలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలైన పాటల పోటీలు,డాన్స్ పోటీలు, స్కిట్స్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల గురించి,తమ ప్రగతి గురించి ప్రసంగించిన అనంతరం విద్యార్థులకు ఫిజికల్ డైరెక్టర్స్ కె.నాగేశ్వరరావు,టి.వెంకటేశ్వర్లు మెడల్స్ స్పాన్సర్ చేశారు.వాటిని ప్రధానోపాధ్యాయులు మెడబలిమి శేఖర్‌రావు,భవాని మేడం,నీలిమ,చైతన్య విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శేఖర్‌రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆహ్వానించిన వెంటనే విచ్చేసిన తల్లిదండ్రులకు, దాతలకు, పెద్దలకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావటానికి కారణమైనటువంటి పేరెంట్స్ కమిటీ చైర్మన్ సిహెచ్.రాంబాబుకు, పూర్వ విద్యార్థులకు, వారి నాయకులు రొండా దశరథ్, శ్రీ ఊటుకూరి శ్రీమన్నారాయణ, ఉపాధ్యా యునీ, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బుద్ధి మోహన్ రావు,కె.నారాయణరావు, జి.శివశంకర్, ఎం.డేవిడ్ పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

అదానీ కుంభకోణాలపై తక్షణమే విచారించాలి : శ్రీదర్

విశాలాంధ్ర - బాపట్ల : అదానీ అవినీతి కుంభకోణపై అదానీ గ్రూప్ కంపెనీలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని అంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బి.కె.ఎం.యు) జిల్లా కార్యదర్శి జేబి శ్రీధర్ సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా బాపట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మణిపూర్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సాయుధబలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించాలన్నారు. నేడు పేదవాడు బ్రతికేందుకు వీలు లేకుండా నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశం అటుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తూ ఉన్నాయని తక్షణమే అధిక ధరలను నియంత్రించాలన్నారు. ఎంతోమంది ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే నిరుద్యోగులందరికీ ఉద్యోగులు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే విద్యుత్ ఛార్జీలు పెంపుదలను నిలిపివేయాలన్నారు. అమెరికాలోని న్యూయర్‌కు ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ కోర్ట్‌లో ఆదానీపై అవినీతి కేసు నమోదు అయిందని విద్యుత్ ఒప్పందాల కోసం దాదాపు 2100 కోట్లు దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో అదానీ లంచాలుగా ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇందులో అత్యధికంగా 1750 కోట్లు మన రాష్ట్రంలోనే గత ప్రభుత్వ హయాంలో ముడుపులుగా ముట్టజెప్పినట్లు తెలుస్తుంది అన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీల భారం మోపబడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అదానీతో చేసుకున్న ఒప్పందాలు అన్ని రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అదానీని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతం రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏటగిరి శ్రీనివాసులు , జిల్లా మహిళా సమాఖ్య కన్వీనర్ జె.రత్నకుమారి, ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మేకల బిజిలిబాబు, సీపీఐ నాయకులు శ్రీనివాస రావు,అట్లపోలి రెడ్డి,ఎ.ఐ.వై.ఎఫ్ లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : ఆర్డీవో

విశాలాంధ్ర - రేపల్లె : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవో రామలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.సోమవారం రెవెన్యూ రేపల్లె డివిజనల్ అధికారి కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగినది. కార్యక్రమమునకు వచ్చిన 5 ఫిర్యాదులను పరిశీలిం చామని వచ్చిన అర్జీలను అధికారులకు పంపడం జరిగిందని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అర్జీదారులు పాల్గొన్నారు.

30శాతం ఐఆర్ ప్రభుత్వం ప్రకటించాలి

విశాలాంధ్ర - రేపల్లె : ఉపాధ్యాయులకు 30శాతం ఐఆర్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పీఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య డిమాండ్ చేశారు.రేపల్లె హంస జూనియర్ కళాశాలలో పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు సరెండర్ లీవ్స్, పిఎఫ్ లోన్స్, ఏపీ జిఎల్ఐలోన్స్ తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడిగా రేపల్లెకు చెందిన ఉపాధ్యాయులు అంగిరేకుల రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎంవీ రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనగాని వెంకట నారాయణ ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసూరి రాజశేఖర్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా పిఆర్టియు నాయకులు అభినందించారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలో రైతులు రబి సీజన్‌లో తాము సాగు చేసిన పంటలను రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఎన్.మేరమ్మ అన్నారు. పొగాకు, శెనగ, మిరప, మొక్కజొన్న, మినుము పంటలను తమ పొలం పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, ఫోన్ నెంబర్‌లను తీసుకువెళ్లి నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఓడిఎఫ్ అభ్యంతరాలు తెలపండి

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలో ఇప్పటి వరకు నాలుగు సార్లు ఓడిఎఫ్ ప్రెస్‌గా రేపల్లె గుర్తింపు పొందిందని మునిసిపల్ కమిషనర్ సాంబశివరావు తెలిపారు. ప్రస్తుతం ఓడిఎఫ్‌గా గుర్తింపు పొందడానికి రేపల్లె పట్టణాన్ని ఎంపిక చేయనున్నారని కమిషనర్ తెలిపారు. ఓడిఎఫ్ అభ్యంతరాలపై ఈనెల 30లోగా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

బెల్ట్ షాపులపై ఉక్కు పాదం

విశాలాంధ్ర - వేమూరు : నిబంధనలకు వ్యతిరేకంగా బెల్ట్ షాపులు నడిపితే ఉపేక్షించేది లేదని బెల్ట్ షాపు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్డెంట్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. వేమూరు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వం అక్రమ మద్యం వ్యాపారంపై ఉక్కు పాదం మోపాలని ఆదేశించిందన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా బెల్ట్ షాపులకు మద్యం విక్రయించే లైసెన్స్ షాపులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రమ మద్యం విక్రయదారులపై నిఘా ఉంచాలని ఆదేశించారు.మరిన్ని కేసులు నమోదయ్యే విధంగాచర్యలు తీసుకోవాలని సూచించారు.ఆయనతో పాటు ఎక్సైజ్ సీఐ రవికుమార్,ఎస్సై,సిబ్బంది ఉన్నారు. మండలంలోని జంపని గ్రామంలో సోమవారం సాయంత్రం బెల్ట్ షాప్ పై దాడి చేసి ఒక వ్యక్తి నుండి12 సీసాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీఐ రవికుమార్ తెలియజేశారు.

ముగిసిన జాతీయ స్థాయి ఆటలు పోటీలు

విశాలాంధ్ర - వేటపాలెం : ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ చాంపియన్షిప్-2024 సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా వివేక హై స్కూల్లో ఏర్పాటుచేసిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేషనల్ సెక్రటరీ వై.మాలిక్ మాట్లాడుతూ 7,8, 9 తేదీలు మూడు రోజులుగా నిర్వహించిన ఆటల పోటీలు ఎంత ఉత్సాహంగా సాగాయన్నారు. గేమ్స్ ఆర్గనైజర్ కావూరు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కోకో, క్రికెట్ పోటీల్లో తెలంగాణ విద్యార్థులు మొదటి బహుమతిని సాధించార న్నారు. వాలీబాల్ పోటీల్లో చీరాల విజ్ఞాన భారతి విద్యార్థులు, కబడ్డీ పోటీల్లో వేటపాలెం వివేక హైస్కూల్ విద్యార్థులు, కరాటే పోటీల్లో మదర్ తెరిస్సా హైస్కూల్ విద్యార్థులు, కరాటే జూనియర్స్ విభాగంలో ఒప్పకుందూరు ఆక్స్ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులు, నాంచాక విభాగంలో వివేక హై స్కూల్ విద్యార్థి బంగారు పతకాలు గెలుచు కున్నారు. కార్యక్రమంలో వివేక హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు పోలేటి రాజశేఖర్, కరాటే మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి అధికారులకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు, అధికారులకు, పంచా యతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఈనెల 10 నుండి 19 వరకు రేపల్లె మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.శోభారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 10,11 తేదీలలో గంగడిపాలెం, పేటేరు, రాజు కాల్వ, బేతపూడి, ఆరవపల్లి, మొల్లగుంట, డిజిటల్ అసిస్టెంట్లకు మినహాయించి 12,13న బేతపూడి-2 తుమ్మల, పెనుమూడి, సింగుపాలెం, మొర్లవారి పాలెం, పేటేరు-2, 16,17న కైతేపల్లి, చోడయపాలెం, నెల్లూరు నార్త్, కామరాజు గడ్డ నార్త్,పిరాట్ లంక గ్రామాల డిజిటల్ అసిస్టెంట్లకు మినహాయించి 18,19న వడ్డీవారిపాలెం, ఉప్పూడి, చాటగడ్డ, కారుమూరు, పోటుమెరక, గుడ్డికాయలంక గ్రామాల డిజిటల్ అసిస్టెంట్లు మినహాయించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండల స్థాయి అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు హాజరు కావలసిందిగా ఎంపీడీవో కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-టంగుటూరు : స్థానిక టంగుటూరులోని జాతీయ రహదారి 16 నార్త్ బైపాస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి సుమారు 40 సంవత్సరాల వయసు వ్యక్తి మృతదేహం ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నీలం రంగు జీన్స్ ప్యాంటు చొక్కా ధరించి ఉన్నాడు, చొక్కాపై కాంటాక్ట్ టైలర్ చిలకలూరిపేట కేవీ వెంకటేశ్వర్లు అని ఆనవాళ్లు లభించాయి. మృతుడికి సంబంధించి ఎటువంటి చిరునామా లభించకపోవడంతో అనుమా నాస్పద మృతిగా టంగుటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. చనిపోయిన వ్యక్తి యొక్క ఆచూకీ తెలిసిన యెడల టంగుటూరు పోలీస్ స్టేషన్ సింగరాయకొండ సర్కిల్ ఆఫీస్ ఒంగోలు డి.ఎస్.పి వారికి తెలియచేయాలని స్థానిక ఎస్సై నాగమల్లేశ్వరరావు కోరారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు 8 నెలలు, స్వచ్ఛ భారత్ కార్మికులకు 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలంటూ సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అధిక ధరలతో ఇల్లు గడవని ఇబ్బందికర పరిస్థితుల్లో వేతనాలు నెలల తరబడి ఇవ్వకపోతే తాము ఎలా బ్రతకాలంటూ వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. క్రిస్మస్ పండగలోపు చెల్లించి తమను ఆదుకోవాలంటూ వినతి పత్రం ఎంపీడీఓ శ్రీదేవిని అందజేశారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు, మండల అధ్యక్షులు కుందుర్తి అనిల్, కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర-దొనకొండ: పేదలు ఆత్మ గౌరవంతో బ్రతికేలా నిలువ నీడను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి ఇంటి స్థలాలను తక్షణమే కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) దర్శి నియోజకవర్గ కార్యదర్శి మాదపాకుల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇంటి స్థలాలు కోరుతూ మండలంలోని రుద్రసముద్రం గ్రామస్తుల సోమవారం సుమారు 200 మంది పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ అతి పెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో నేటికి సొంత ఇల్లు లేని నిరుపేదలు ఉండం అత్యంత బాధాకరమని, దీనికి కారణమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యొక్క చిత్తశుద్ధిని శంకిస్తున్నామ న్నారు. గత ప్రభుత్వంలో 32 లక్షల ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ చాలా మందికి కేటాయించిన స్థలాలు చూపించలేదన్నారు. ఊరికి దూరంగా నివాస యోగ్యం కానీ ప్రదేశంలో ఇచ్చిన స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయని, నాడు ఇచ్చిన రూ. 1.80 లక్షలతో బేస్ మట్టం సైతం వేయలేదన్నారు. నేడు గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులు జరుగుతుండగా రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాల కొరకు ప్రభుత్వ భూమిని గుర్తించటమే కాక అర్హులైన పేదలకు 3 సెంట్లు భూమి మంజూరు చేయాలన్నారు. పెరిగిన సిమెంట్, ఇటుక, ఇనుము ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటి నిర్మాణంకు రూ.5 లక్షల నగదును ఇవ్వాలని పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. బీకేయంయు రాష్ట్ర నాయకులు జూపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ కూలీ పనులు చేసుకుంటూ బ్రతికే పేదలను ఏ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, ఉపాధి హామీ పథకంలో చక్కగా పనులు జరగటం లేదు కనుక ప్రభుత్వం చొరవ తీసుకుని 300 రోజులు పనులు కేటాయించి ఉపాధి కల్పించాలన్నారు. స్థలాలు ఉన్న కొందరికి తక్షణమే గృహాలు మంజూరు చేయాలని కోరారు. మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి మాట్లాడుతూ రుద్రసముద్రంలో ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాల వారు నివసిస్తున్నారని, గత ప్రభుత్వం కొందరికే స్థలాలు వచ్చాయని, ఈ ప్రభుత్వంలోనైనా గ్రామంలోని ప్రతి ఒక్కరికి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించాలని కోరు తున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం కేటా యించి, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మొత్తం 145 మంది స్థలాలు కావాలంటూ రెవెన్యూ సిబ్బందికి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి మాదపాకుల రమేష్‌బాబు, సహాయ కార్యదర్శి కూరేటి బాలయ్య, బియంయు రాష్ట్ర నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి, ఏఐఎస్ఎఫ్ నాయకులు స్టాలిన్, సురేంద్ర, బచ్చలకూరి మరియదాసు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-తాళ్లూరు : రైతులు దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ జిల్లా ప్రాజెక్టు మాదిరి అన్నారు. మండలంలోని విఠలాపురం, కొర్రపాటి వారి పాలెంలలో సోమవారం ఆయా గ్రామల సర్పంచులు మారం ఇంద్రసేనారెడ్డి, శ్రీదేవి రామయ్యల అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కేవీ పాలెంలో దీర్ఘకాలికంగా ఎస్టీలకు తాము వాడుకుంటున్న భూమికి నివాస పట్టాలు ఇప్పించాలని కోరారు. విఠలాపురంలో తమ భూమి ఆక్రమంగా మరొకరు ఆన్లైన్లో నమోదు చేసుకున్నారని, తమ అనుభవంలో ఉన్న పొలాలను ఆన్‌లైన్ నుండి తీసివేసారని ఫిర్యాదులు చేసారు. తహసీల్దార్ సంజీవ రావు, డిటీ ఇమ్మానియేల్ రాజు వీఆర్ఓలు పాల్గొన్నారు.

వైసీపీ ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమా వేశంకు ముఖ్య అతిథిగా ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కుందూరు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ నిన్న జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ప్రజా ఎన్నికలలో గెలిచిన పార్టీ కాదని మోసపూరితమైన ఈవీఎంలతో గెలిచిన పార్టీ టిడిపి కుటమి పార్టీ అని ఎద్దేవా చేశారు. ప్రజా పరిపాలన పక్కనపెట్టి తప్పుడు కేసులు పెట్టి వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలను వేధిస్తున్నారని ఎన్నికలలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కారని ప్రస్తుతం అమ్మబడి జగనన్న వసతి దీవెన విద్యా దీవెన ఫీజు రియంబర్స్మెంట్ లేక విద్యార్థులు తల్లడిల్లి పోతున్నారని. గెలిచి ఆరు నెలలు అయినా టిడిపి ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారన్నారు.

ప్రసాద్‌కు ఆత్మీయ సన్మానం

విశాలాంధ్ర- ఒంగోలు : టీటీడీ గరుడ అవార్డు గ్రహిత, భారతీయం కళార్చన ఉత్తమ నటుడు, జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ ఆత్మీయ సన్మానం అందుకున్నారు. పద్మశ్రీ ఘంటసాల వి. రామకృష్ణ సాంస్కృతిక సేవా సంస్థ 34వ కార్యక్రమాల్లో ఒంగోలులోని సివిఎస్ రీడింగ్ రూంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు, శ్రీకృష్ణ దేవరాయ సేవా సమితి అధ్యక్షులు మద్దెల వరసింహారావు, ప్రముఖ కళాకారులు అంగకుర్తి ప్రసాద్‌కు ఘన సన్మానం చేశారు. సన్మాన గ్రహితల గురించి వక్తలు ప్రసంగించారు. విశ్రాంతి అధ్యాపకుడు హైదపూడి నరసింహారావు మాట్లాడుతూ అంగకుర్తి ప్రసాద్ కళామతల్లి ముద్దు బిడ్డ అని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో పలు సాంఘీక నాటకాల్లో, పౌరాణిక నాటకాల్లో విభిన్న పాత్రల్లో ఉత్తమ నటుడుగా, హాస్య నటుడుగా పలు అవార్డులు అందుకున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఎన్టీఆర్ కళాక్షేత్రం ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రకాశం జిల్లా ఏర్పడిన తర్వాత క్రమం తప్పకుండా 90 నెలలు పాటు రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్విరామంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అందరి పట్ల సేవా దృక్పదంతో పని చేస్తున్న అంగలకుర్తి ప్రసాద్‌కు ఆత్మీయ అవార్డు అందుకోవడంపై ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. జిల్లా సంగీత కళాకారుల సమైక్య అధ్యక్షులు అనంతలక్ష్మీ, ప్రకాశం జిల్లా పౌరాణిక కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు వాకా సంజీవరెడ్డి, శ్రీ వీరాంజనేయ నాట్య మండలి మాకా అంజనేయులు, శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ ముసలయ్య, రంగభూమి కళాకారులు సంఘం, ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కళాకారులు అంగలకుర్తి ప్రసాద్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పెండ్యాల సాయి మాస్టర్, దేవరకొండ వెంకటేష్, బి. శ్రీనివాసరావు, వెంకటేష్, కర్నాటి కోటేశ్వరరావు, వైవి. రావు, రమా మెలోడీస్, గాయకరాలు శైలజ, చిత్ర, సుహాసిని, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ లేక నిలిచిన సేవలు



విశాలాంధ్ర-పిసిపల్లి : పిసిపల్లి మండలంలోని పెదఅలవలపాడు సచివాలయంలో గత నాలుగు నెలలుగా డిజిటల్ అసిస్టెంట్ లేక సేవలు నిలిచిపోయాయి. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన డిజిటల్ అసిస్టెంట్ నాలుగు నెలల క్రితం బదిలీపై వెళ్లిపోవడంతో ఇక్కడ ఎవరినీ నియమించలేదు. సిఎస్ పురం మండలానికి చెందిన ఓ డిజిటల్ అసిస్టెంట్‌ను పెద అలవలపాడు సచివాలయానికి బదిలీ చేసినప్పటికీ అక్కడ రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వక పోవడంతో రాలేదని సమాచారం. పెద అలవలపాడు సచివాలయానికి వచ్చేందుకు అతను నిరాకరించడంతోనే అక్కడ రిలీవింగ్ ఆర్డర్ జారీ చేయలేదని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో స్థానికులు ప్రజలు సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం ఏదో ఒక పనులతో వందల మంది సచివాలయానికి వచ్చి డిజిటల్ అసిస్టెంట్ లేరని అక్కడ సిబ్బంది సమాధానం చెప్పడంతో నిరాశతో వెనుదిరిగిపోతున్నారు. మరసటి రోజు రావటం వెళ్ళిపోవటం జరుగుతూనే ఉండ డంతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి సచివాలయానికి డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఎంపీడీవో వివరణ : ఈ విషయంపై స్థానిక విశాలాంధ్ర విలేకరి ఎంపీడీవో ప్రభాకర్ శర్మను వివరణ కోరగా పెద అలవలపాడు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేరన్న విషయం తమ దృష్టికి రాలేదని వెంటనే ఇన్చార్జిని నియమించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలియజేశారు. పెద అలవలపాడు సచివాలయ సిబ్బందిని వివరణ కోరగా గత నాలుగు నెలలుగా డిజిటల్ అసిస్టెంట్ లేరని ఉన్నతాధికారులకు ఎప్పుడో సమాచారం అందించామని అయినప్పటికీ నియమించలేదని తెలిపారు.

వధూవరులను ఆశీర్వదించిన లావు, గుర్రం, దారపనేని



విశాలాంధ్ర-పామూరు : దారపనేని చెన్న కృష్ణ (కిష్టయ్య) అంజమ్మల కుమారుడు అజయ్ కృష్ణ, నరసరావుపేటకు చెందిన యేను గంటి వెంకటరావు, సీతల కుమార్తె ప్రగతిల వివాహ వేడుకలు ఆదివారం రాత్రి గుంటూరులోని శుభం కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, రాష్ట్ర టిడిపి మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర, పామూరు మండలం మోపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో టిడిపి నాయకులు చిట్టిబాబు, చల్లా కొండయ్య, కొల్లు శ్రీనివాసరావు, దారపనేని జనార్ధన్ రావు,ధనియాల గాంధీ, చల్లా అంకయ్య, పచ్చావా వెంగయ్య, తిరి వీధి బాబు,తిరివీధి రమణయ్య, రామకృష్ణ దారపనేని, యేనుగంటి వారి కుటుంబ సభ్యులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : సీపీఐ శతాబ్ది ఉత్సావాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం సీపీఐ బాపట్ల నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం ఏటగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బాపట్ల నియోజక వర్గంలో సీపీఐ శాఖలు అన్నీ డిసెంబర్ 26న సీపీఐ జెండాను ఎగరవేయాలన్నారు. సీపీఐ సభ్యత్వాలు రెన్యూవల్ చేసి జిల్లా పార్టీ కార్యాలయానికి పంపించాలన్నారు. సీపీఐ 100 ఏళ్ళ పూర్తి చేసుకున్న సందర్భంగా పండుగలా జరపాలన్నారు. ఫిబ్రవరి మాసంలో ర్యాలీ బహిరంగ సభలు జరిపి సీపీఐ 100 ఏళ్ల ఉత్సవాలను ఉత్సాహంగా చేసేందుకు పార్టీ క్యాడర్ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 17న ఏఐవైఎఫ్ బాపట్ల నియోజకవర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య కన్వీనర్ జె.రత్నకుమారి,ఎ.ఐ.వై.ఎఫ్ జిల్లా కన్వీనర్ మేకల బిజిలిబాబు, సీపీఐ నాయకులు శ్రీనివాస రావు,అట్ల పోలి రెడ్డి,ఎ.ఐ.వై.ఎఫ్ లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా భూముల దస్త్రాలన్నీ

అధికారులు పునఃపరిశీలన చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల దస్త్రాలన్నీ అధికారులు పునఃపరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన నిర్వహించారు. నిషేధిత భూముల జాబితా నుంచి 3,034 ఎకరాలు తొలగించగా ఇప్పటివరకు 2,500 ఎకరాలను పరిశీలించినట్లు కలెక్టర్ చెప్పారు. మూడు రోజుల్లో పరిశీలన ప్రక్రియ ముగించాలన్నారు. చుక్కల భూమి 4,981 ఎకరాలు ఉండగా, పరిశీలన ప్రక్రియ సత్వరమే చేపట్టాలన్నారు. రీ సర్వే సదస్సుల వచ్చిన పీజీఆర్ఎస్ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు. 8 మండలాలలో అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అర్జీలు పునరావృతం అవుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని నిలదీశారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా ఉండరాదని హెచ్చరించారు. ప్రతి సోమవారం పి జి ఆర్ ఎస్ కార్యక్రమం అన్ని మండల కేంద్రాలలో జరగాలన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ఈనెల 10, 11, 12 తేదీలలో వరి పంట కోతలు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారు. వరి కోత యంత్రాలు నడపరాదని, ఈ మూడు రోజులలో యంత్రాలు నడిపితే వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి

పంటనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తెలిపారు. నీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. 14న టీసీలకు ఎన్నికలు జరుగుతాయని, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీకి ఎన్నికలు నిర్వహించాల న్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా విడుదల కొరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను తక్షణమే విచారణ పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డులు లేనివారు 2,850 మందిని గుర్తించగా, ప్రత్యేక డ్రైవ్ ద్వారా 1,970 మందికి ఆధార్ ఇవ్వడంపై సమీక్షించారు. మిగిలినవి త్వరలో పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డులు వచ్చిన వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, భూ వివాదాలు లేని గ్రామంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. రెవిన్యూ సదస్సులను సమర్థంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారో.. ఆ గ్రామంలోనే రాజకీయ నాయకులు, రైతు సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, ఎన్జీవోలను కలుపుకుని ముందస్తుగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆర్ ఎస్ ఆర్, వెబ్ ల్యాండ్ రికార్డ్స్, అడంగల్, వన్ బి, ఆర్ ఎస్ ఏ, బేసిక్ రికార్డులను ఖచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో జనవరి 8 వరకు సమర్థంగా సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామానికి సంబంధించిన మ్యాప్ లు ప్రతి గ్రామంలో ప్రచార బోర్డులలో ప్రదర్శనగా ఉంచాలన్నారు. నీటి తీరువా పన్నులు లక్ష్యం మేరకు వసూలు చేయాలని కలెక్టర్ తెలిపారు. భూమి సాగుదారుల నుంచి రూ.13.45 కోట్లు డిమాండ్ ఉండగా వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీఆర్వోల ద్వారా వసూలు ప్రక్రియ వేగంగా చేపట్టాలని, ఇందుకోసం తహసీల్దార్లు రైతులను చైతన్య పరచాలన్నారు. ఆర్డీవోల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఆదేశించారు. మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ లుగా ఉన్న అధికారులకు కనీసం అవగాహన లేకపోతే ఎలా పని చేస్తారని మండలించారు. జిల్లా వ్యాప్తంగా 35 సినిమా థియేటర్లు ఉండగా, కేవలం 16 థియేటర్లకే లైసెన్స్ ఉండడంపై ఆరా తీశారు. తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పది రోజులలో తాసిల్దార్ల పనితీరులో పురోగతి కనిపించాలని సుదీర్ఘంగా సమీక్షించిన కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు పి గ్లోరియా, రామలక్ష్మి, కె ఆర్ఆర్సి ఎస్‌డిసి లవన్న, కలెక్టరేట్ ఏవో సీతారత్నం, మండల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

మాటలు చెప్పను... మంచి చేసి చూపిస్తా..

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికలు ముందు ఇచ్చిన మాట మేరకు బాపట్ల నియోజకవర్గ ప్రజలకు మంచి చేసి చూపిస్తా అని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సీఎం చంద్రబాబు పర్యటనపై వ్యంగ్యంగా అసందర్భంగా అసత్యాలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావోస్తుందని ఇప్పటికే ప్రజలకు నీతివంతమైన పాలన అందిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం బాపట్ల పర్యటనలో 10 కోట్లు ఖర్చు దుబారా చేశారని మాజీ ఎమ్మెల్యే కోన మాట్లాడటం సిగ్గు చేటన్నారు. కేవలం రూ.18 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని కావాలంటే రసీదులతో సహా పంపుతా చూసుకోవాలని తెలిపారు. సీఎం పాల్గొంటున్న కార్యక్రమంలో తాను ఆ స్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థిని అని నాకు ఆహ్వానం అందలేదని చెప్పటం అతని పరిపక్వతకు వదిలేస్తున్నానన్నారు. ఆ స్కూల్లో పూర్వ విద్యార్థివైన మీరు 10 ఏళ్ల పాటు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. బాపట్లలో నీవు చేసిన అభివృద్ధి బాపట్లలో ఉద్రిక్తత్తమైన దోమలు మురుగు కాలువలు చెపుతున్నాయని వాటిని నివారించేందుకు స్వచ్ఛ్ బాపట్లగా చేసేందుకు ఎమ్మెల్యే అయిన వెంటనే కార్యచరణ చేపట్టి ముందుకు సాగుతున్నామన్నారు. బాపట్ల పురపాలక సంఘ

ఉన్నత పాఠశాల పరిధిలోని అదనపు తరగతి గదుల కోసం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే భవనాల నిర్మాణం శంకుస్థాపన చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. నాడు నేడు కింద వీటిని అభివృద్ధి చేశామని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొనటం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఆ కట్టడాలను మేమే ప్రారంభించాం. మళ్లీ మేమే తిరిగి ప్రారంభోత్సవం చేస్తాం. ఇందులో ఏమాత్రం సందేహం లేదని సూటిగా చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీని కోసం 40 లక్షలు కేటాయించిందని, సంబంధిత కాంట్రాక్టర్లకు ఆ బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. 2014 -19 సంవత్సరంలో నిర్మాణం జరిగిన ఈ భవనాలను వైసిపి ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. మళ్లీ తిరిగి వాటిని తమ ప్రభుత్వమే పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ భవనాలను సిద్ధం చేస్తామని వెల్లడించారు. వాస్తవం ఇదైతే ఆ భవనాలను మీ ప్రభుత్వ హయాంలో ఎలా అభివృద్ధి చేశారో అర్థం కావడం లేదన్నారు. ఆరోపణలు చేసే ముందు పూర్తిస్థాయి వాస్తవాలు ఉండాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో బాపట్ల అభివృద్ధికి ఎటువంటి భరోసా ఇవ్వలేదని కోన రఘుపతి అంటున్నారు. అది పూర్తిగా ప్రభుత్వ కార్యక్రమం విద్యా వ్యవస్థను బలోపేతం చేసే ఏకైక కార్యక్రమం ఇందులో వేరే అంశాలకు అవకాశం లేదు అయినప్పటికీ బాపట్ల అభివృద్ధి కోసం, బాపట్ల మెడికల్ కళాశాల అవశ్యకతతో పాటు, 35 అంశాలతో కూడిన వివిధ శాఖల వివరణలతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాపట్ల పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నరేంద్ర వర్మ ప్రశ్నించారు. నియోజకవర్గంలో రైతులు అధైర్యపడొద్దు మీరు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వందే అని అందోళన చెంది పంటను తక్కువ దరకు దళారులకు అమ్ముకోవదన్నారు. వరి గిట్టుబాటు ధర రూ.1740 ఉందని తేమను శాతం ఎక్కువగా ఉంటే 1600 చెల్లిస్తున్నారని కొనుగోలు చేయకపోతే సమాచారం ఇవ్వాలన్నారు. రాబోవు ఐదేళ్లలో ప్రజలకు ఆకాంక్ష మేరకు సుపరిపాలన అందిస్తానని తెలిపారు. మంచి బాపట్లకు అందరు సహకరించాలని వర్మ విజ్ఞప్తి చేశారు.

మహిళ ఆత్మహత్య

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని చెన్నుపాడు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన గుత్తి మౌనిక (22) సోమవారం ఉదయం తన ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని చనిపోయినట్లు తన తండ్రి అంజయ్య పొన్నలూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మౌనిక ఒక సంవత్సరం క్రితం తన తల్లి మరణించినప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మానసికంగా కృంగిపోతుందేదని ఇటీవల తనకు కలిగిన అనారోగ్య నిమిత్తం తనలో తాను బాధపడుతూ ఎవరికి చెప్పుకోలేక తన ఇంటి గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో తన మెడకు ఉరివేసుకొని చనిపోయినట్లు మృతురాలి తండ్రి అంజయ్య పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పొన్నలూరు ఎస్ఐ కె.అనూక్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిమిత్తం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తరలించారు.

SHAMS UL ULOOM COLLEGE OF EDUCATION
Recognised by N.C.T.E and Affiliated to Andhrakesari University, Ongole
Ongole Road,podili523240 | Prakasam Dt. Andhrapradesh
Admission Notification for B.Ed "A" & "B" Category Seats
Applications are invited from Eligible Candidates for Management Quota (Cat-B) and Cat-A/ left over seats (Spot Admissions) for the Academic year 2024-2025

Category A Seats 75	Total Vacancies
Category B Seats 25	100 +10(E.W.S)

Apply along with relevant certificates copies should submit in the college office on any working day by online in college website/post/mail on or before 02.04.2024 for selection of Candidates.
Note:- Preference will be given to the A.P. State Candidates and left over seats will be allotted to the other State Candidates.
Cell: 9490377760,9490386895 Secretary & Correspondent